సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం। 27। జూన్। 2023



లోతట్టు ప్రాంతాలు జలమయం

హుకుంపేట, ముంచంగిపుట్టు మండలాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి 8లో



ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

గిరిజన రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు మార్టేరు పరిశోధనా స్థానం ఏడీఆర్ భరతలక్ష్మి తెలిపారు. 8లో



'సిరి' సిత్రాలు చూడరో..

తృణధాన్యాలతో ప్రముఖుల చిత్రాలను అలవోకగా తీర్చిదిద్దుతున్నారు విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్. 8లో

న్యూస్‌రీల్

జగనన్న సురక్షతో అర్హులకు సంక్షేమం

- జిల్లా ఆడిట్ అధికారి సువర్ణ ఫణి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఆడిట్ అధికారి సువర్ణ ఫణి

పెదబయలు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అర్హులకు పథకాలు అందించే లక్ష్యంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఆడిట్ అధికారి సువర్ణ ఫణి, ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య సూచించారు.సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పలు సూచనలు చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రతీ సచివాలయ ఉద్యోగి, సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, గ్రామ వలంటీర్లు, గృహ సారధులు ప్రతీ ఇంటికి వెళిఅర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీటీ కృష్ణారావు, ఈవోపీఆర్డీ నర్సింగరావు, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాడేరులో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశం

అడ్డతీగల: కేంద్రప్రభుత్వ రుణ పథకాలపై ఈనెల 27 న జిల్లా స్థాయి బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటుచేసినట్లు ఎంపీడీవో కె.బాపన్నదొర చెప్పారు. ఈ మేరకు కలెక్టర్ అధ్యక్షతన లీడ్‌బ్యాంక్ అధికారుల సమన్వయంతో ఈ సమావేశం పాడేరులో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వివిధ రుణ పథకాలపై సమీక్ష ఉంటుందన్నారు. ఆయా రుణ పథకాల కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను క్రోడీకరించి ఈ సమావేశంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశం దృష్టికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని ఆయన వివరించారు.

విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీకి దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, పాడేరు: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల కేసుల పరిశీలన, విచారణ చర్యలు నిమిత్తం, జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ కమిటీలో ఎస్సీ, ఎస్టీలకు 5 మందిని, స్వచ్ఛంద సంస్థలను నడుపుతున్న ఇతర కులాలకు చెందిన ముగ్గురిని సభ్యులుగా నియమించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ కమిటీ రెండేళ్ళ కాలపరిమితి ఉంటుందని, దరఖాస్తులు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. వీటిని పూర్తి చేసి తగిన ధ్రువపత్రాలు జతచేసి జిల్లా కార్యాలయంలో వచ్చే నెల 7వతేదీలోగా అందజేయాలని ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 8985868068 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

పేదలకు భోజనం ప్యాకెట్ల పంపిణీ



పేదలకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. వారపు సంత, ప్రభుత్వ కార్యాలయాల పనులపై వచ్చిన సుమారు 210 మందికి అందజేశారు. ఈకార్యక్రమంలో సిఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ ఇన్‌చార్జి అసిస్టెంటు కమాండెంటు వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సింహగిరిపై వరదపాయసం సేవ

సింహాచలం: సింహగిరిపై ఉన్న వైకుంఠవాసుడి మెట్టపై మంగళవారం వరదపాయసం సేవ నిర్వహించనునారు. వర్షాలు కురవాలని, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, పంటలు బాగా పండాలని వైకుంఠవాసుడి సన్నిధిలో వరదపాయసం సేవ నిర్వహించడం పూర్వకాలం నుంచి వస్తోంది. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి వరదపాయసం సేవ నిర్వహిస్తారని అధికారవర్గాలు తెలిపాయి.

వచ్చే ఏడాదికి వైద్య కళాశాల సిద్ధం

- చురుగ్గా పాడేరులో భవన నిర్మాణ పనులు
- పలు బ్లాక్‌లను తనిఖీ చేసిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- త్వరితంగా భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశం
- రక్తదాతలకు అభినందన



మోదకొండమ్మతల్లికి పూజలు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



వైద్య కళాశాల భవన నిర్మాణాల నమూనాను పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు, కలెక్టర్ సుమిత్‌కుమార్,ఎంపీ మాధవి. ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ, ఇతర ప్రజాప్రతినిధులు

సాక్షి,పాడేరు: గిరిజనులకు ఉన్నత వైద్యం, విద్య లక్ష్యంతో పాడేరులో రూ.500 కోట్లతో చేపట్టిన వైద్య కళాశాలలో వచ్చే ఏడాది నుంచి తరగతులను ప్రారంభిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. మెడికల్ కళాశాల నిర్మాణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. పలు బ్లాక్‌ల భవన నిర్మాణాలను తనిఖీ చేశారు. ఆయా పనుల ప్రగతిపై అధికారులతో పాటు నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్షించారు. వారికి పలు సూచనలు చేశారు. వైద్య కళాశాల నమూనాను అధికారులు మంత్రికి చూపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది పాడేరుతో పాటు మరికొన్ని జిల్లాల్లోని వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వైద్య కళాశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్య కళాశాల నిర్మాణ ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారన్నారు. గతంలో ఉన్నత వైద్యసేవలకు విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆపరిస్థితి లేదన్నారు. గతంలో వైద్యులు, సిబ్బంది కొరత ఉండేదని, ఇటీవల ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా 49 వేలకు పైగా ఖాళీలను భర్తీ చేశారన్నారు. గిరిజన ప్రాంతాలకు వైద్య నిపుణులు, ఆధునిక వసతులు అందుబాటులోకి రావడం మంచి పరిణామమన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. వైద్యపరీక్షల నిమిత్తం వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పరీక్షల అనంతరం ధ్రువపత్రాలు అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. రక్తదాతలను అభినందించారు.

గిరిజనుల ప్రాణదాతగా సీఎం

గిరిజన ప్రాంతాలకు ఉన్నత వైద్యసేవలు అందుబాటులోకి తెస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల ప్రాణదాతగా చరిత్రలో నిలుస్తారని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ అన్నారు. రూ.500 కోట్లతో పాడేరులో మెడికల్ కళాశాల నిర్మాణంతో పాటు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, వైద్య నిపుణులను అందుబాటులోకి తెచ్చారన్నారు. గిరిజనులకు అన్నివిధాలా మేలుచేస్తున్న సీఎంకు తామంతా రుణపడి ఉండటమే కాకుండా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. ఈకార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కలెక్టర్ సుమిత్‌కుమార్, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు అభిషేక్,సూరజ్ గనోరే, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని



ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్లతో థింసా నృత్యం చేస్తున్న మంత్రి విడదల రజిని

మోదమ్మను దర్శించుకున్న మంత్రి రజిని

పాడేరులోని మోదకొండమ్మతల్లిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని సోమవారం దర్శించుకున్నారు. గిరిజన యువతుల థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలు హోరెత్తాయి.పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి,ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు దంపతుల ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో మంత్రిని ఆహ్వానించారు. అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. మంత్రిని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు శాలువాతో సత్కరించారు. అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి,యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, పాడేరు, అరకులోయ నియోజకవర్గాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

థింసా నృత్యంతో సందడి

గిరిజన సంప్రదాయ థింసా నృత్యాన్ని చూసి వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమశాఖ మంత్రి విడదల రజిని మురిసిపోయారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జీసీసీ, జెడ్పీ చైర్‌పర్సన్లు జల్లిపల్లి సుభద్ర, డాక్టర్ స్వాతిరాణి, ఇతర గిరిజన యువతులతో ఆమె నృత్యం చేసి సందడి చేశారు. ఎస్పీ తుహిన్‌సిన్హా ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

థ్యాంక్యూ సీఎం సార్



తమ సర్వీసులను క్రమబద్ధీకరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సమక్షంలో వారంతా ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. థాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు.

మెరుగైన వైద్యసేవలందించండి

- వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి తిరుమల కృష్ణబాబు



మాట్లాడుతున్న తిరుమల కృష్ణబాబు

పాడేరు: గిరిజన ప్రాంతంలో మెరుగైన వైద్యసేవలందించాలని రాష్ట్ర వైద్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎం.తిరుమలకృష్ణబాబు ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, సీడీపీవోలతో వైద్య ఆరోగ్యసేవలు, అంగన్‌వాడీల్లో పోషకాహారం సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులను పదిరోజులు ముందుగానే బర్త్ వెయిటింగ్ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అరకువ్యాలీ, చింతూరులలో బ్లడ్‌బ్యాంకులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆస్పత్రులకు సరఫరా చేస్తున్న మందుల నిల్వలపై ఆరా తీశారు. పీహెచ్‌సీల నుంచి వచ్చిన ఇండెంట్ ప్రకారం మందులు సరఫరా చేయాలని సెంట్రల్ డ్రగ్స్‌స్టోర్స్ అధికారులను ఆదేశించారు. మాతాశిశు వైద్యసేవలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కౌమారదశ బాలికలకు అందిస్తున్న పోషకాహారం పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో రక్తహీనతతో ఉన్న చిన్నారులతో ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు మింగించాలన్నారు. పాఠశాల విద్యా విభాగం, వైద్య ఆరోగ్య శాఖాధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం, చర్మ వ్యాధులు సోకకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కుష్టువ్యాధి, టీబీ వ్యాధుల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నాన్‌కమ్యూనికబుల్ డిసీజెస్, కమ్యూనికబుల్‌డిసీజెస్ సర్వే వేగంగా శతశాతం పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ నుంచి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, జిల్లా ఆస్పత్రుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుష్టు నిర్మూలనపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ సలిజామల, జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు అభిషేక్, సూరజ్ గనోరే, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లావైద్య ఆరోగ్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, వైద్యాధికారులు, సీడీపీవోలు పాల్గొన్నారు.

పోలవరానికి నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



కూనవరం సభలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కూనవరం: జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరానికి నిధులు ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ నిర్వాసితులను మోసం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. పోలవరం పోరు కేక నినాదంతో చేపట్టిన సీపీఎం పాదయాత్ర సోమవారం వీఆర్‌పురం మండలం నుంచి కూనవరం మండల కేంద్రానికి చేరుకుంది. ఈసందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ వరకు అరకొరగా నిధులులిస్తుందన్నారు. నిర్వాసితులకు మాత్రం మొండి చేయి చూపిస్తోందని ఆరోపించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై నేడు సీపీఎం పార్టీ గవర్నర్‌ను కలవనున్నట్లు తెలిపారు. వచ్చే నెల నాలుగో తేదీన విజయవాడలో నిర్వహించనున్న మహా ధర్నాకు పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. పాదయాత్రకు వివిధ రాజకీయ పార్టీలు, యూటీఎఫ్ నాయకులు సంఘీబావం తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, మేకల నాగేశ్వర రావు, కుంజా రాధ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి పంపిణీ

- ఐదు కుటుంబాలకు రూ.15 లక్షల మంజూరు
- అందజేసిన ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు



కల్తీ కల్లు బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు ప్రాంతం లోదొడ్డిలో గతేడాది ఫిబ్రవరిలో కల్తీ కల్లు సేవించి ఐదుగురు మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబాలకు సోమవారం సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అందజేశారు. లోదొడ్డి రచ్చబండ వద్ద జరిగిన కార్యక్రమంలో ఒకొక్క కుటుంబానికి రూ.3 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. గత ఏడాది జీలుగల్లు చెట్టుపై కల్లుకుండలో విషప్రయోగం వల్ల ఆ కల్లును సేవించిన అదే గ్రామానికి చెందిన చదల సుగ్రీవు,బూసరి సన్యాసిరావు, పొత్తూరి గంగరాజు, వేమా లోవరాజు, కుడే ఏసుబాబు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాలు వీధిన పడ్డాయి. ఈ హృదయవిదారక విషయాన్ని ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఐదు కుటుంబాలకు రూ.3లక్షల చొప్పున చెక్కులు విడుదల అయ్యాయి. వీటిని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్ రాజు, వైస్ ఎంపీపీలు జుర్రా రాజేశ్వరి, చప్పా చంద్రరాణి, నాయకులు కొంగర మురళీకృష్ణ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు,

కిత్తాబు ఉపాధ్యాయుడు సరెండర్

- విధుల పట్ల నిర్లక్ష్యమే కారణం
- కలెక్టర్ ఆదేశాల మేరకు పాడేరు ఐటీడీఏ పీవో చర్యలు

కొయ్యూరు: విధులపట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వెలగలపాలెం పంచాయతీ కిత్తాబు ట్రైబల్ వెల్ఫేర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (జీపీఎస్) ఉపాధ్యాయుడు మాతే జయరామ్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు ఐటీడీఏ పీవో అబిషేక్ గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ కార్యదర్శికి సరెండర్ చేశారు. గతేడాది ఉపాధ్యాయులు బూదరాళ్ల పంచాయతీ వంతమర్రి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో క్రాంతి విచారణ నిర్వహించారు. సంజాయిషీ కోరుతూ మూడు మెమోలు ఉపాధ్యాయుడికి పంపించారు. దీనిపై ఆయన నుంచి స్పందన కరువైంది. ఈ విషయాన్ని పీవో దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన కూడా ఉపాధ్యాయుడికి నోటీసులు పంపారు. దీనిపై కూడా ఉపాధ్యాయుడు స్పందించలేదు. దీంతో కలెక్టర్‌కు పరిస్థితిని వివరించారు. గిరిజన సంక్షేమశాఖకు సరెండర్ చేయాలని కలెక్టర్ పీవో అబిషేక్‌ను ఆదేశించారు. ఈమేరకు పీవో గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికి సరెండర్ చేశారు. దీనిపై ఏటీడబ్ల్యూవో క్రాంతిని వివరణకోరగా సరెండర్‌కు ఆదేశాలు వచ్చాయన్నారు. విధుల పట్ల ఉపాధ్యాయుడు నిర్లక్ష్యం చేయడంతోపాటు నాడు–నేడు పనుల పట్ల కూడా అదేవిధంగా వ్యవహరించారన్నారు. దీనిపై కలెక్టర్ చర్యలు తీసుకున్నారని ఏటీడబ్ల్యూవో పేర్కొన్నారు.

మదిని దోచేలా..

మన్యం అందాలను తిలకించేందుకు దేశవిదేశాలతో పాటుగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు భారీగా తరలివస్తుంటారు. రోడ్డు ప్రయాణానికి వీరు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఘాట్‌రోడ్డులో ప్రకృతి అందాలను తిలకిస్తూ, పచ్చని చెట్ల నడుమ ప్రయాణం సాగించే వీరికి మన్యం ముఖద్వారంలో అటవీశాఖ అభివృద్ధి చేస్తున్న పార్కులు స్వాగతం పలకనున్నాయి.



అంజోడ సిల్క్‌ఫాం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులు

- పార్కులను తీర్చిదిద్దుతున్న అటవీశాఖ
- అంజోడ సిల్క్‌ఫాం రూ.70 లక్షలతో వసతులు
- చిలకలగెడ్డ చెక్‌పోస్టు వద్ద నందనవనం ఏర్పాటు

అనంతగిరి: జిల్లాలో మరికొన్ని పార్కులు అందుబాటులోకి రానున్నాయి. చిలకలగెడ్డ చెక్‌పోస్టు, అంజోడ సిల్క్‌ఫాం వద్ద పర్యాటకులను ఆకర్షించేలా పార్కుల ఏర్పాటుకు అటవీశాఖ సంకల్పించింది. సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ సహకారంతో వీటిని అభివృద్ధి చేయనుంది.

అడవుల సంరక్షణతోపాటు..

ఏజెన్సీలో అడవుల సంరక్షణతోపాటు పర్యాటకులకు ఆహ్లాద వాతావరణం కల్పించేలా పార్కులను అటవీశాఖ అభివృద్ధి చేయనుంది. చిలకలగెడ్డ చెక్‌పోస్టు, అంజోడ సిల్క్‌ఫాం వద్ద పార్కుల అభివృద్ధికి నిర్ణయించిన అధికారులు, తొలివిడతలో అంజోడ సిల్క్‌ఫాం వద్ద పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టింది.

ఇందుకు గాను సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ రూ.70 లక్షలు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. వీటిలో రూ.35 లక్షలను విడుదల చేసింది. వీటితో పనులు ప్రారంభమయ్యాయి.

మరింత వన్నెలద్దేలా..

అంజోడ సిల్క్‌ఫాం సుమారు 27 ఎకరాల్లో ఉంది. అటవీశాఖ ఆధ్వర్యంలోని 1972లోనే పైన్స్ ప్లాంటేషన్ ఏర్పాటుచేసింది. వీటితో పాటు నీలగిరి చెట్లు భారీగా పెరిగాయి. ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నందున ఇక్కడ సినిమా షూటింగ్‌లు జరగుతుంటాయి. మారుమూల ప్రాంతం కావడంతో అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రాంతాన్ని పార్కుగా అభివృద్ధి చేయడంతోపాటు పర్యాటకులకు అవసరమైన మౌళిక వసతులు కల్పిస్తోంది. పార్కు చుట్టు ఫెన్సింగ్, విద్యుత్ సౌకర్యం, పర్యాటకులు సౌకర్యార్థం తాగు నీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టింది.

చిలకల గెడ్డ చెక్‌పోస్టు వద్ద..

అటవీశాఖ మన్యానికి ముఖద్వారమైన చిలకలగెడ్డ చెక్‌పోస్టు వద్ద పర్యాటకులకు అనువుగా పార్కును అటవీశాఖ తీర్చిదిద్దింది. పర్యాటకుల సౌకర్యార్థం రచ్చబండలు, పాత్‌వే, నర్సరీ, కాఫీ హౌస్, స్నాక్స్, ఏర్పాటు చేసింది. పార్కును అనుకుని ఉన్న కొండ మీదనున్న వ్యూపాయింట్ వద్దకు ట్రెక్కింగ్‌కు వెళ్లేలా చర్యలు చేపట్టింది.

పర్యాటకులు సేద తీరేలా..

మన్యానికి వచ్చే పర్యాటకులు మరింత అనుభూతిని కలిగించేలా చిలకలగెడ్డ, అంజోడ పార్కులను తీర్చిదిద్దుతున్నాం. మొదటి విడతలో అంజోడ పార్కు లోని మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఆహ్లాదకరమైన వాతావరణంలోని పర్యాటకులు సేదతీరేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అంజోడ పార్కులోని పర్యాటకులు ఫొటో షూట్లు తీసుకునేలా ఏర్పాట్లు చేశాం.

– వినోద్‌కుమార్, డీఎఫ్‌వో పాడేరు



చిలకలగెడ్డ చెక్‌పోస్ట్ వద్ద అభివృద్ధి చేసిన పార్కు



ఎల్క్ ఫాంను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు



పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన రచ్చబండలు

క్లుప్తంగా

లోతట్టు ప్రాంతాలు జలమయం

- ఎడతెరిపి లేకుండా వర్షాలు



దిగుడుపుట్టు వంతెన వద్ద వరదనీరు

హుకుంపేట: అల్పపీడన ప్రభావంతో మండలంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రధాన రహదారి కామయ్యపేట రోడ్డులో భారీగా వరద నీరు చేరింది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.

ముంచంగిపుట్టు: మండలంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి.దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మండల కేంద్రంలోని సంతబయలులో ఇళ్లలోకి వరదనీరు చేరింది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల నిత్యం వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో బూసిపుట్టు, బుంగాపుట్టు, రంగబయలు, లక్ష్మీపురం మార్గాల్లో సోమవారం కురిసిన వర్షానికి వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహించాయి. మారుమూల గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడ్డారు.

బెంగళూరు వీక్లీ స్పెషల్ పొడిగింపు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-బెంగళూరు-విశాఖపట్నం మధ్య నడుస్తున్న వీక్లీ స్పెషల్ మరి కొంతకాలం పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖలో ప్రతీ ఆదివారం బయల్దేరే విశాఖపట్నం-బెంగుళూరు(08543) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ జూలై 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ప్రతీ సోమవారం బెంగళూరులో బయల్దేరే బెంగళూరు -విశాఖపట్నం (08544) వీక్లీ స్పెషల్ జూలై 3వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

‘సిరి’ సిత్రాలు చూడరో..

చిత్రకళలో అతనొక ప్రత్యేకం. అందరూ రంగులు వాడితే ఆయన రాగులు, అరికలు, సజ్జలు, గంట్లు, సామలు వినియోగిస్తారు.. వీటితోనే అద్భుత చిత్రాలకు జీవం పోస్తున్నారు. ఏ రంగంలోనైనా ప్రత్యేకత చాటుకోకపోతే ఉనికి ఉండదు. అందుకే మోకా విజయ్ కుమార్ తనకంటూ ఓ బ్రాండ్ సృష్టించుకున్నారు. వివిధ దేశాల నుంచి వచ్చిన అతిథుల మనసు దోచుకున్నారు. హైదరాబాద్‌లో జీ20 సదస్సులో అతిథులకు చిత్రాలు బహూకరించిన అనంతరం విజయకుమార్ విశాఖ చేరుకున్నారు. ఆయన కళానైపుణ్యంపై ప్రత్యేక కథనం.. -ఏయూక్యాంపస్

- తృణధాన్యాలతో ప్రముఖుల చిత్రాలు
- విదేశాలకు పాకిన విశాఖ చిత్రకారుడి ప్రతిభ
- ఇప్పటి వరకు 60 చిరుధాన్యాలతో చిత్రాల రూపకల్పన



తాను తీర్చిదిద్దిన తృణధాన్యాల చిత్రాలతో విజయ్‌కుమార్

తృణధాన్యాలతో ప్రముఖుల చిత్రాలను అలవోకగా తీర్చిదిద్దుతున్నారు విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్. ఈ సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా చిరుధాన్యాలకు అంతటి ప్రాముఖ్యత లభిస్తోంది. దీనిని సాధనంగా చేసుకుని విశాఖ నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ తన ప్రతిభకు కొత్తదనాన్ని జోడించారు. సమాజంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించే విధంగా తన కళకు కాస్త కొత్తదనాన్ని జోడించారు. నేడు జాతీయ స్థాయిలో విజయ్‌కుమార్ తీర్చిదిద్దిన చిత్రాలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన జి 20 సదస్సులో భాగంగా 38 దేశాలకు చెందిన వ్యవసాయ శాఖ మంత్రుల చిత్రపటాలను తయారు చేసి మంత్రులకు, వారి అధికారులకు బహూకరించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు సైతం ఆయన చిత్రపటాన్ని సిరిధాన్యాలతో తయారు చేసి విజయ్ కుమార్ స్వయంగా బహూకరించారు. హైదరాబాద్‌లో జీ20 సదస్సులో అతిథులకు చిత్రాలు బహూకరించిన అనంతరం విజయ కుమార్ విశాఖ చేరుకున్నారు.

రైల్వేలో ఉద్యోగం చేస్తూ..

విజయ్ కుమార్ రైల్వేలో గ్రేడ్ 1 ఉద్యోగిగా పనిచేస్తున్నారు. చిన్నతనం నుంచి చిత్రకళపై ఉన్న ఆసక్తి చిత్రకారుడిగా చిత్రకారుడిగా మార్చింది. రెండున్నర దశాబ్దాలుగా రైల్వేలో పనిచేస్తూనే చిత్రకళపై ఆసక్తి ఉన్న చిన్నారులకు సైతం శిక్షణ ఇస్తున్నారు. పెన్సిల్, కలర్ ఆర్ట్ వేయడంలో విజయ్ కుమార్ నిష్ణాతుడు.

అంతర్జాతీయ స్థాయికి భారతీయ కళ

భారతీయ కళావైభవాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీసుకువెళ్లిన విజయ్ కుమార్ ఇప్పటి వరకు 60కి పైగా జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల చిత్రపటాలను ఆయన కేవలం చిరుధాన్యాలను ఉపయోగించి, ఎటువంటి రంగులు వాడకుండా తయారు చేయడం విశేషం. ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులతో పాటు ప్రధాని చిత్రపటాలను సైతం వీటిలో ఉన్నాయి.

ఒక్కో చిత్రానికి నాలుగు రోజులు

ఒక్కో చిత్రం తయారు చేయడానికి దాదాపు నాలుగు రోజుల పడుతుంది. ప్రధానంగా రాగులు, అరికలు, సజ్జలు, గంట్లు, సామలు వినియోగిస్తున్నారు. జర్మనీలో తయార్యే కాన్సన్ వాటర్ కలర్ షీట్‌పై ముందుగా పెన్సిల్‌తో అవసరమైన చిత్రానికి అవుట్‌లైన్ గీసుకుంటారు. అనంతరం దీనిపై



కేంద్ర ఆహార మంత్రి తోమర్‌కు తృణధాన్యాల చిత్రపటం అందిస్తున్న విజయ్ కుమార్

ఫొటోకు అవసరమైన విధంగా సజ్జలు, రాగులు, అరికలు, సామలు, గంట్లు వంటి సిరిధాన్యాలను ఎంతో జాగ్రత్తగా అతికిస్తూ చిత్రాన్ని తీర్చిదిద్దుతారు. అనంతరం పెస్ట్ కంట్రోల్ చేసి, గాలి చొరబడకుండా ప్రత్యేకంగా ఫ్రేమ్ కట్టిస్తారు.

జీ–20 సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా..

విశాఖ వేదికగా జరిగిన ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సైతం ప్రముఖుల చిత్రాలను సిరిధాన్యాలతో తయారు చేసి బహూకరించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (హైదరాబాద్) నిపుణులు ఈ చిత్రాలను పరిశీలించి, విజయ్ కుమార్ కృషిని ప్రత్యేకంగా అభినందించారు. సిరిధాన్యాలకు ప్రాచుర్యం కల్పించే విధంగా విజయ్ కుమార్ చేస్తున్న ప్రయత్నాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. తృణధాన్యాలతో వందకు పైగా చిత్రాలను తయారు చేసి గిన్నిస్‌రికార్డు సాధించడమే లక్ష్యమని విజయ్ కుమార్ తెలిపారు.

ఆర్టీసీకి హ్యాపీ సమ్మర్!

- వేసవిలో పెరిగిన ఆక్యుపెన్సీ
- 67 శాతానికి పైగా ఓఆర్ నమోదు
- విశాఖ రీజియన్‌కు రూ.83.50 కోట్ల ఆదాయం
- ఈసారి ఏసీ సర్వీసులకు ఎనలేని డిమాండ్



సాక్షి, విశాఖపట్నం: ఈ వేసవి మలమల మాడించింది. తీవ్ర వడగాడ్పులతో దడ పుట్టించింది. అయితే ఆర్టీసీకి మాత్రం ఆనందాన్నిచ్చింది. ఆశించిన స్థాయికంటే అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. సాధారణంగా ఎండాకాలంలో పెళ్లిళ్లు, ఇతర శుభ ముహూర్తాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలు వంటి విద్యాసంస్థలకు వేసవి సెలవులు ఇవ్వడంతో కుటుంబ సభ్యులతో కలిసి ఇతర ప్రాంతాలకు, విహార యాత్రలకు వెళ్తుంటారు. వీటన్నిటితో బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య ఇతర రోజుల్లోకంటే వేసవిలో అధికంగా ఉంటుంది. అందుకనుగుణంగానే ఈ సీజనులోనూ ప్రయాణికుల తాకిడి బాగుంది. ఆర్టీసీ విశాఖ జిల్లాలో ఏప్రిల్‌కు ముందు బస్సుల్లో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 55 శాతం వరకు ఉండేది. ఏప్రిల్ నుంచి ఓఆర్ పెరుగుతూ వచ్చింది. ఏప్రిల్‌లో 55 శాతం, మేలో 67, జూన్‌లో (26వ తేదీ వరకు) 68 శాతం చొప్పున ఓఆర్ నమోదైంది. మరోవైపు సాధారణ నాన్-ఏసీ బస్సులకంటే ఏసీ సర్వీసుల్లో ఓఆర్ మరింత అధికంగా ఉంది. 40-45 డిగ్రీల ఉష్ణోగ్రతల వేసవి తాపం, తీవ్ర వడగాడ్పులకు తాళలేక దూరప్రాంతాలకు వెళ్లే పలువురు ప్రయాణికులు ఏసీ బస్సుల్లో ప్రయాణానికి బాగా మొగ్గు చూపారు. దీంతో ఈ బస్సుల్లో 83 శాతం వరకు ఆక్యుపెన్సీ రేషియో నమోదైంది. ఏప్రిల్‌లో నెలలో ఇది 50 శాతానికి మించలేదు. ఇలా ఓఆర్‌తో పాటు ఆర్టీసీకి రాబడి కూడా పెరిగింది. విశాఖపట్నం నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ రోజుకు 30 ఏసీ బస్సులను నడుపుతోంది. వీటిలో హైదరాబాద్‌కు ఆరు, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళంలకు 16, విజయవాడ, కడప, అమలాపురంలకు ఎనిమిది బస్సుల చొప్పున నడుస్తున్నాయి. ఇవన్నీ 80 శాతానికి పైగా ఓఆర్ సాధించాయి. ఏప్రిల్ నెలలో రూ.25.50 కోట్లు, మే నెల రూ.32 కోట్లు, జూన్‌లో ఇప్పటివరకు రూ.26 కోట్లు వెరసి ఈ వేసవి మూడు నెలల్లో రూ.83.50 కోట్ల ఆదాయం సమకూరింది. ఇది ఆర్టీసీకి ఊరటనిచ్చే అంశమని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు ‘సాక్షి’కి చెప్పారు.

ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

అడ్డతీగల: గిరిజన రైతుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా గిరిజన ఉప ప్రణాళిక కింద రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం, భారత వరి పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గిరిజన ఉప ప్రణాళిక కింద సోమవారం అడ్డతీగలలో గిరిజన రైతులకు రాయితీపై రూ.2.10 లక్షల విలువైన వరి విత్తనాలు ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన గిరి రైతుల అవగాహన కార్యక్రమంలో సహ పరిశోధన సంచాలకులు భారతలక్ష్మి మాట్లాడుతూ 2022 సంవత్సరంలో విడుదలైన ఎంటీయూ–1318 రకం వరి విత్తనాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. నేరుగా వారి ప్రాంతాల్లో విత్తే పద్ధతిని గిరిజన రైతులు అవలంభించి తద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవాలన్నారు. పంట ఊడ్చిన వెంటనే ప్రెటిలాక్లోర్ మందు పిచికారీ చేయడం వల్ల కలుపుని సమర్థవంతంగా నివారించవచ్చన్నారు.సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసుకునే బియ్యాన్ని అమ్ముకోవడం వల్ల రైతులకు ఆర్థికంగా లాభసాటిగా ఉంటుందని చెప్పారు. దేశంలోని వివిధ వాతావరణ పరిస్థితులను తట్టుకుని సాగుకి అనుకూలమైన రకాల వరి విత్తనాలను రైతులకు ఇస్తున్నామని శాస్త్రవేత్తలు ఎ.స్వామి, జె.అరవింద్‌కుమార్ అన్నారు.


విత్తనాలే కాకుండా రైతులకు గిరిజన ఉప ప్రణాళిక కింద జీవన ఎరువులు, పనిముట్లు, టార్పాలిన్లు తదితర వాటిని అందిస్తామన్నారు. వరిలో యాజమాన్య సాగు పద్ధతుల గురించి శాస్త్రవేత్తలు టి.శ్రీనివాస్, ఎన్.శ్రీనివాస్ వివరించారు. రైతుల వినతుల మేరకు కొన్నిచోట్ల సోలార్ కంచెల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమం అనంతరం పలువురు గిరిజన రైతులకు వరి విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. అడ్డతీగల సహాయ వ్యవసాయ సంచాలకులు కె.సావిత్రి, మండల వ్యవసాయాధికారి సువర్ణకుమారి ఇతర వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాజులబందుకు రూ.9 కోట్లతో రహదారి

కొయ్యూరు: మండలంలోని మూలపేట పంచాయతీ జాజులబందకు రహదారి కష్టాలు తీరనున్నట్టు జేఈ రామకృష్ణ చెప్పారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ బచింత నుంచి జాజులబంధ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.9కోట్ల నిధులు మంజూరైనట్టు చెప్పారు. దాదాపుగా 12 కిలోమీటర్ల దూరంలో నాలుగు గ్రామాలను కలుపుతూ రోడ్డు నిర్మించనున్నట్టు తెలిపారు. ఈ దారి మధ్యంలో ఒక వంతెన కూడా నిర్మిస్తామన్నారు. కుమ్మర్ల గ్రామం మీదుగా ఈ రహదారి జాజులబంధకు వెళ్తుందని చెప్పారు. అక్కడ పాఠశాల భవనాన్ని, తాగునీటి పథకాన్ని కూడా ఏర్పాటుచేస్తామన్నారు. రహదారికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయిన తరువాత ప్రభుత్వ ఆదేశానుసారం పనులు ప్రారంభిస్తామన్నారు. రోడ్డు నిర్మాణంతో రవాణా సౌకర్యం అందుబాటులో రావడంతో శివారు గ్రామాల్లో డోలీమోత కష్టాలు తీరుతాయన్నారు. తాండవ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో భవన నిర్మాణానికి రూ.3.5కోట్లు నిధులు మంజూరయ్యాయని, టెండర్ ప్రక్రియ పూర్తికాగాను పనులు ప్రారంభిస్తామన్నారు.

అధ్వాన దారితో అవస్థలు

ముంచంగిపుట్టు: మండలంలోని శివారు రంగబయలు పంచాయతీ కేంద్రానికి రోడ్డు అధ్వానంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తారు వేసి మూడు నెలల్లో రోడ్డు బీటలు వారిందని, గ్రామస్తులు చెబుతున్నారు. వనుగుమ్మ పంచాయతీ కేంద్రం నుంచి రంగబయలు పంచాయతీ కేంద్రం మీదగా జోడిగుమ్మ వరకు రూ.16.90 కోట్లతో 18 కిలోమీటర్ల రహదారి మంజూరైంది. యుద్ధప్రాతిపదిక పనులు చేసి ఏప్రిల్ నెలలోనే తారు వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టిగూడ, చంపాపుట్టు, జోడిగుమ్మ గ్రామాల సమీపంలో తారురోడ్డు బీటలు వారిందని, కొన్ని చోట్ల కొండచరియలు విరిగిపడడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి రోడ్డుకు మరమ్మతు పనులు చేపడతామన్నారు.



మట్టిగూడ వద్ద బీటలు వారిన తారురోడ్డు

గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ నిర్మూలన

డాబాగార్డెన్స్: శ్రీవరహాలక్ష్మీ నరసింహ స్వామి గిరి ప్రదక్షిణలో నిషేధిత ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పలు స్వచ్ఛంధ సంస్థలను కోరారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో సోమవారం పలు స్వచ్ఛంధ సంస్థలు, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్‌జీవోస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నందున గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు అందించే ప్రసాదాలు, పానీయాలు ప్లాస్టిక్ కలిగిన వస్తువుల్లో అందించొద్దన్నారు. ఎన్ఎస్ఎస్ ద్వారా 500 మంది వలంటీర్లను, అలాగే స్వచ్ఛంధ సంస్థలు వీలైనంత వరకు ఎక్కువ మంది వలంటీర్లను ఏర్పాటు చేసి గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. స్వచ్ఛంధ సంస్థలు ఏఏ ప్రాంతాల్లో తమ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే యూఎన్‌డీపీ కన్సల్టెంట్ రాజామణికి తెలియజేయాలన్నారు. 14 ఏళ్ల లోపు గల పిల్లలకు గిరి ప్రదక్షిణలో తప్పిపోకుండా జీవీఎంసీ ట్యాగ్‌లు ఏర్పాటు చేస్తుందని, ట్యాగ్‌పై తల్లిదండ్రుల పేర్లతో పాటు ఫోన్ నంబర్ రాయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వరం వైఎస్సార్ పశు బీమా

మహారాణిపేట: రైతులకు వైఎస్సార్ పశు బీమా పథకం వరమని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో వైఎస్సార్ పశుబీమా పథకం పోస్టర్, కరపత్రాలను సంబంధిత శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ఆపత్కాలంలో పశు బీమా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పాడి పశువులు, జీవాలు ఆకస్మికంగా చనిపోయినప్పుడు రైతులు నష్టపోతారని, కేవలం 20 శాతం బీమా సొమ్ము చెల్లిస్తే ఆపత్కాలంలో ఆసరా అవుతుందని పేర్కొన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డా.రామకృష్ణ మాట్లాడుతూ కేవలం రూ.384 చెల్లిస్తే రూ.30 వేలు..మూడేళ్ల కాలానికి బీమా వర్తిస్తుందన్నారు. ఈ సదుపాయం గొర్రెలు, మేకలు, పందులు పెంపకం దారులకు ఉపయోగపడుతుందన్నారు. దీనికి సంబంధించి సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1962కు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డా.కరుణాకరరావు, సహాయ సంచాలకులు డా.శ్రీనివాస్, డా.శ్రీనుబాబు, డా.మాదిన ప్రసాదరావు, డా.పూర్ణిమ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

యలమంచిలి : గూండ్రుబిల్లి గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపిన వివరాలివి. నక్కపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన సాదిరెడ్డి నాగేశ్వరరావు (36) ఆదివారం ఏటికొప్పాక గ్రామంలో ఒక శుభ కార్యానికి వెళ్లి తిరిగి తన ద్విచక్రవాహనంపై పులపర్తి గ్రామం నుంచి ఎస్.రాయవరం వైపు వెళ్తుండగా గూండ్రుబిల్లి గ్రామం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావును బంధువులు విశాఖపట్నంలోని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కటుంబం సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కశింకోట : కశింకోటలోని సత్తెమ్మ కాలనీ వద్ద ఏలేరు కాలువలో సోమవారం గుర్తు తెలియని సుమారు 45 ఏళ్ల మహిళ మృతదేహాన్ని కనుగొన్నట్టు ఏఎస్ఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకు వచ్చి ఇక్కడ నీటిపై తేలుతూ చిక్కుపడడంతో స్థానికులు గుర్తించి సమాచారం అందించారన్నారు. దీంతో వీఆర్‌వో దరిమిరెడ్డి ఉదయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని వెలికి తీసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని ఎస్ఐ తెలిపారు. మృతురాలు నీలి రంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించి ఉందని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాడేరు రోడ్డు మార్గంలో బైక్ ప్రమాదం



పాడేరు రోడ్డు మార్గంలో ప్రమాదకరంగా ఉన్న గోతులు (ఇన్‌సెట్) శివాలయం వద్ద ప్రమాదానికి గురైన రాము

జి.మాడుగుల : జి.మాడుగుల–పాడేరు రోడ్డు మార్గంలో శివాలయం సమీపంలో బైక్ అదుపు తప్పిన ఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలివి. నర్సీపట్నానికి చెందిన రాము తన బైక్‌పై సోమవారం పాడేరు వెళుతుండగా సంతబయలు గ్రామ సమీపంలో శివాలయం వద్ద బైకు అదుపు తప్పడంతో అతని రెండు చేతులు విరిగిపోయాయి. గాయపడిన రామును చికిత్స నిమిత్తం 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. రోడ్డు మధ్యలో మూడు చోట్ల గోతుల కారణంగా ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది.

మహిళ మెడలో బంగారం అపహరణ

మునగపాక : మహిళ మెడలో నుంచి రెండు తులాల తాడును బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అపహరించుపోయిన సంఘటన మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. మునగపాక గ్రామానికి చెందిన వరలక్ష్మి సోమవారం అనకాపల్లి వెళ్లి వస్తూ తిరుగు ప్రయాణంలో ఆటో ఎక్కింది. ఇదే సమయంలో ఓ వ్యక్తి తలకు హెల్మెట్ తగిలించుకొని బైక్‌పై ఆటోను కొంతదూరం అనుసరించాడు. .అనకాపల్లి జాతీయ రహదారి దాటాక ఆటోలో కూర్చొన్న వరలక్ష్మి మెడలోని తాడును బలవంతంగా లాగే ప్రయత్నం చేశాడు. ఆమె ప్రతిఘటించడంతో మూడు పేటలున్న తాడుకు గాను ఒక పేట తాడు(రెండు తులాలు)ను ఎత్తుకుపోయాడు. దీంతో బాధిత మహిళ వరలక్ష్మి కన్నీటిపర్యంతమైంది. ఈ విషయమై ఎస్ఐ ఆలీని సంప్రదించగా ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

యువ న్యాయవాదులకు చేదోడు

- వైఎస్సార్ ‘లా’ నేస్తం నిధుల విడుదల
- జిల్లాలో 601 మందికి లబ్ధి



యువ న్యాయవాదులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

మహారాణిపేట : కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకునేందుకు మూడేళ్లపాటు ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తోంది. ఏడాదికి రూ.60 వేల చొప్పున రెండు విడతల్లో వారి ఖాతాల్లో జమ చేస్తోంది. మూడేళ్లలో ఒక్కో న్యాయవాదికి మొత్తం రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి-జూన్ మధ్య ఐదు నెలల కాలానికి జిల్లాలో అర్హులైన 601 మంది యువ న్యాయవాదులకు రూ.5 వేలు చొప్పున స్టైఫండ్ అందించింది. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి 2023-24 సంవత్సరానికి మొదటి విడత ‘వైఎస్సార్ లా నేస్తం’ ఆర్థిక ప్రోత్సాహకాన్ని బటన్ నొక్కి విడుదల చేశారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, యువ న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలో అర్హులైన 601 మంది యువ న్యాయవాదులకు రూ.30,05,000 మొత్తాన్ని మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. యువ న్యాయవాదులు వృత్తిలో స్థిరపడేందుకు లా నేస్తం దోహదం పడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో పూర్ణిమదేవి, యువ న్యాయవాదులు పాల్గొన్నారు .

సీఎంకు ధన్యవాదాలు



గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి బి.ఎల్ చదివాను. ఏడాది నుంచి జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న. వైఎస్సార్ ‘లా’ నేస్తం సహాయం నాకు ఎంతగానో ఉపయోగపడింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– కె.అమల, న్యాయవాది

ఎంతో ఉపయోగకరం



నేను ఎంతో కష్టపడి చదువుకున్నాను. ఇప్పుడు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నాను. నా తల్లిదండ్రుల మీద ఆధారపడకుండా ఈ పథకం ఎంతగానో మేలు చేస్తుంది. ఈ పథకం మాలాంటి యువన్యాయవాదులకు ఎంతో ఉపయోగకరం.

– టి.సాయి ప్రియాంక, న్యాయవాది

ఆనందంగా ఉంది



ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్ ‘లా’ నేస్తం పథకాన్ని అమలు చేస్తున్నారు. న్యాయవాది చదువు పూర్తి చేసి ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో డబ్బులు ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.

– బి.గౌతమ్, న్యాయవాది